# నేడు సీఎం రేవంత్ రెడ్డి




## 3 జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తెలుగు దినపత్రిక డైలీ రిపోర్ట్ DAILY REPORT

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మూడు జిల్లాల్లో పర్యటిస్తారు.
- సీఎం తోపాటు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పలువురు మంత్రులు హాజరై ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.
- కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల లో పట్టభద్రులతో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేశారు.

**తెలంగాణ పొలిటికల్ బ్యూరో రవీంద్ర , డైలీ రిపోర్ట్, ఫిబ్రవరి 24**

ఉత్తర తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ఈరోజు మూడు జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొనబోతున్నారు. రేపటితో ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో ఆఖరి మోకాగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి పార్టీ నేతల సహకారం సన్నగిల్లిందనే ప్రచారం జోరు అందుకుంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.ఈరోజు సోమవారం నిజామాబాద్, మంచిర్యాల కరీంనగర్ మూడు చోట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కరీంనగర్ లో ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే ఎమ్మెల్సీ పట్టభద్రుల భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సీఎం టూర్ ఖరారు కావడంతో మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ కరీంనగర్ కు చేరుకొని పార్టీ శ్రేణులతో సమావేశమై ఏర్పాట్ల పై దృష్టి పెట్టారు. సభకు ప్రతి కార్యకర్త ఒక పట్టభద్రుని తీసుకొని హాజరు కావాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ, ఎస్సీల వర్గీకరణ పై బిజెపి వైఖరి స్పష్టం చేయాలని రాష్ట ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. బిజెపి బిఆర్ఎస్ రెండు ఒక్కటేనని, తమకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్సేనని కరీంనగర్ స్పష్టం చేశారు. ఎవరు ఎవరితో ఉన్నారో తేల్చుకుందాం రండీ అని బిజేపికి సవాల్ విసిరారు.మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ప్రస్తుతం ఎమెల్సీ ఎన్నికల్లో బిజెపి కోసం బిఆర్ఎస్ అభ్యర్థి పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ వేసి కులగణన పై సర్వే చేసి బిసీ లకు న్యాయం చేసేందుకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని సంకల్పించామని తెలిపారు.ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమం చేశామని చెప్పారు. ఈ రెండు ప్రధాన అంశాలపై నిర్ణయం తీసుకోవాల్సిన ధర్మం బిజేపి పై ఉందన్నారు. 50 శాతం మించకుండా రిజర్వేషన్ కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయడానికి బిజేపి సిద్ధమా అని ప్రశ్నించారు. ముస్లింలకు రిజర్వేషన్ వ్యతిరేకిస్తున్న బిజెపి, ఈబీసీని తీసుకొచ్చింది నరేంద్ర మోడీ సర్కారేనని గుర్తుంచుకోవాలన్నారు.317 జీవో పుణ్యం బిజేపిదేనని, దానికి సహకరించింది టిఆర్ఎస్... వాస్తవం కాదా బిజేపి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజేపి కి టిఆర్ఎస్ మిత్రపక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు. గ్రూప్ వన్ పరీక్షను అడ్డుకోవడానికి బిజేపి బిఆర్ఎస్ యత్నించాయని విమర్శించారు. పదేళ్ళ పాలనలో ఎందుకు గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేదో, రాబోయే కాలంలో పట్టభద్రులకు ఏం చేస్తారో బిజేపి చెప్పకుండా దుష్ప్రచారంతో బద్నాం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు

ఎమ్మెల్సీ ఎన్నికలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. రెండు అధికార పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నిక పరీక్షలా మారడంతో అటు బిజెపి, ఇటు కాంగ్రెస్ నేతలు ఈ రెండు రోజుల్లో జోరుగా ప్రచారం సాగించి పట్టభద్రుల ఓటర్లను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాయి.ఐదు రోజులుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ లోనే మకాం వేసి ప్రచారం సాగిస్తుండగా ఆటు కిషన్ రెడ్డి మెదక్ నిజామాబాద్ జిల్లాలో పర్యటించి ప్రచారం చేశారు. ఇక కాంగ్రెస్ కు చెందిన మంత్రులు శ్రీధర్ బాబు మూడు రోజులుగా కరీంనగర్ లోనే మకాం వేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లాపై ఫోకస్ పెట్టారు.ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా బిఎస్పి అభ్యర్థిగా బరిలో నిలిచిన ప్రసన్న హరికృష్ణ గౌడ్ సైతం సింహ గర్జన పేరుతో కరీంనగర్ లో సభ నిర్వహించారు. ఆఖరి మోకా గా ప్రచారాన్ని హోరెత్తించి ఓటర్లను ఆకర్షించి మచ్చిక చేసుకునే పనిలో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నిమగ్నమయ్యారు.